సాక్షి వికారాబాద్

మంగళవారం । 2 । జూలై । 2024



మంచి చేస్తే..మళ్లీ గెలిపిస్తారు

మంచి చేస్తే ప్రజా ప్రతినిధులుగా మళ్లీ వారే అవకాశం ఇస్తారని ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఆందోళన వద్దు..

భూములిస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, కడ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. 8లో▸



భవనం ఒక్కటే..

నంద్రకుంట తండాలోని ఒకే పాఠశాల భవనంలో మూడు శాఖల కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. 9లో▸

‘ధరణి’ భారం

పదివేలకు పైగా దరఖాస్తుల పెండింగ్

పక్క ఫొటో చూస్తే వీరు పిక్నిక్‌కు వచ్చారా..? లేక పొట్ట చేతపట్టుకుని వలసెళ్తున్నారా అనే అనుమానం కలుగక మానదు. కానీ ఎనిమిదేళ్లుగా తమ భూ సమస్యను ఏకరువుపెడుతున్నా ఎవరూ పరిష్కరించడం లేదని సోమవారం కుటుంబ సభ్యులంతా కలిసి కలెక్టరేట్ మెట్లెక్కారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే భోజనాలు చేసి తమ సమస్యకు పరిష్కారం లభించే వరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకున్నారు.

- గుట్టల్లా పేరుకుపోతున్న ఫైళ్లు
- పట్టించుకోని అధికారులు
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



కలెక్టరేట్ ఆవరణలో బైఠాయించిన అంతారం గ్రామానికి చెందిన రైతు కుటుంబ సభ్యులు

వికారాబాద్: తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన తొర్యానాయక్, హీర్యానాయక్, వారి వారసుల పేరిట సర్వే నంబర్ 136లో 9.14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆన్‌లైన్‌లోనూ వారి పేరే చూపుతోంది. కొందరు అక్రమార్కులు తమ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారికే వత్తాసు పలుకుతున్నారని.. తాము ఎనిమిదేళ్లుగా చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలో ఇరుకుటుంబాలకు చెందిన 70 మంది వరకు కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. ఇక్కడే ఉంటామని బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని వారిని సముదాయించడంతో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి వెనుదిరిగారు. ఇదే విషయమై అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను వివరణ కోరగా.. ఆ భూ సమస్య కోర్టు పరిధిలో ఉందని ఇరువర్గాల దగ్గర ఇంజక్షన్ ఆర్డర్ ఉండడంతో కోర్టు సూచనల మేరకు నడుచుకుంటామని తెలిపారు.

టీఎం–33కి భారీగా దరఖాస్తులు

పెండింగ్ దరఖాస్తుల్లో జిల్లా తొలి మూడు స్థానాల్లో ఉంటుంది. భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. ధరణి సమస్యలకు సంబంధించి మొత్తం పది వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.టీఎం–33 (ట్రాన్జాక్షన్ మాడ్యూల్స్), డాటా, నేమ్ కరక్షన్లు, ఆర్ఎస్ఆర్, డిజిటల్ సైన్ తదితర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. సమస్యల పరిష్కారాలకు రైతులు మీ సేవా కేంద్రాల్లో ఫీజుల పేరిట వేల నుంచి లక్షల వరకు వెచ్చిస్తున్నా వాటికి పరిష్కారం లభించడం లేదు.దీంతో ఏళ్ల తరబడి తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇస్తే ఓకే.. లేదంటే రిజెక్ట్!

ధరణి పెండింగ్ సమస్యల విషయంలో రెవెన్యూ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం మొదలుకుని కలెక్టర్ కార్యాలయం వరకు పరిష్కరించగలిగే సమస్యల ఫైళ్లను సైతం పదే పదే రిజెక్ట్ చేస్తున్నారు. దీంతో డబ్బు ఇస్తేనే ఫైళ్లు కదులుతున్నాయని లేదంటే ఏళ్లు గడిచినా సమస్యలు పెండింగ్‌లోనే ఉంటున్నాయని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మీ సేవా కేంద్రంలో దరఖాస్తు తర్వాత తహసీల్దార్ కార్యాలయం అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి రిపోర్టు ఇవ్వాలి. ఆ రిపోర్టులు డబ్బులిస్తే ఓ రకంగా.. ఇవ్వకుంటే అసంపూర్తిగా ఇవ్వడంతో కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ రిజెక్టు చేస్తున్నారని రైతుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

‘ప్రజావాణి’ అర్జీలపై ఫోకస్

- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా 178 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. 178 అర్జీలలో ధరణి, రెవెన్యూ, పెన్షన్, భూ సర్వే, శిశు సంక్షేమ తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులను శాఖల వారీగా వేరు చేసి సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, జెడ్పీ సీఈఓ సుధీర్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

పెద్దేముల్: మండల కేంద్రాల్లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలున్నా.. పలువురు అధికారులు అలసత్వం వీడడం లేదు. ఈ కార్యక్రమానికి ఉదయం 10.30గంటలకు తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రమేశ్, ఏపీఓ బాలు, ఏఓ నజీరుద్దీన్ హాజరవ్వగా.., పశువైద్యాధికారి వెంకటరాజు, ఏపీఓ బాలు, ఉపాధి ప్రోగ్రాం అధికారి నర్సింలు ఆలస్యంగా సమావేశానికి వచ్చారు. మిగిలిన శాఖల అధికారుల జాడే కరువైంది. ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి గది ఎక్కడో తెలియక అర్జీదారులు ఇబ్బంది పడ్డారు. పెన్షన్, పట్టాపాస్‌బుక్, పీఎం కిసాన్ నిధులు తదితర సమస్యలపై దరఖాస్తులు అందాయి. అధికారుల సమయపాలన, గైర్హాజరుపై ఎంపీడీఓను వివరణ కోరగా ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సమాధానమిచ్చారు.

న్యూస్‌రీల్

పేదల వైద్యానికి ‘సీఎంఆర్‌ఎఫ్’

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ఎల్‌ఓసీ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన పద్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.10లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వమే అండగా ఉంటుందన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ వైద్య చికిత్స చేయించుకోవచ్చునన్నారు. ఆరోగ్య శ్రీ పరిధిలోనికి రాని వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, మహేందర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



పుస్తకావిష్కరణలో గురునాథ్‌రెడ్డి

కొడంగల్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఐఐటీ, జేఈఈఈ సంబంధిత పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ ప్రాముఖ్యతను వివరించారు. ఇంజనీరింగ్, మెడికల్ రంగాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మక్సూద్ అలీ, ఉపాధ్యాయులు మనోజ్ పాల్గొన్నారు.

రేపు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికలు

అనంతగిరి: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు బుధవారం వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడలాధికారి హన్మంత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 8గంటలలోపు రిపోర్టు చేయాలన్నారు. ఎంపికలకు వచ్చే విద్యార్థులు స్కూల్ బొనోఫైడ్,జనన ధ్రువపత్రం,కుల ధ్రువీకరణ పత్రం ఆధార్‌కార్డు సమర్పించాలన్నారు. మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతగిరి: పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా విద్యాధికారి రేణుకదేవికి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో స్టేషనరీ సామగ్రి విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు మహేశ్, జగదీశ్, వినయ్, అక్షిత్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

పులి సంచరిస్తోందంటూ వదంతులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో పులి సంచరిస్తోందంటూ వదంతులు మొదలయ్యాయి. గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో సోమవారం ఉదయం గుర్తు తెలియని జంతు కాలి ముద్రలను గ్రామస్తులు గుర్తించారు. అవి పులి కాలి ముద్రలా, లేక హైనా కు సంబంధించినవా అనే అనుమానాలున్నాయి. విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.



తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

సరిహద్దులో నిఘా పటిష్టం

- మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎన్‌బీఎస్ సెక్షన్‌ల ప్రకారం ఎఫ్ఐఆర్‌ల నమోదు
- కొత్త చట్టాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు
- ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు: అంతర్రాష్ట్ర సరిహద్దులో నిఘా పటిష్టం చేసి మత్తు పదార్థాలు విక్రయించేవారి భరతం పడతామని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. జిల్లాలో బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన సోమవారం తొలిసారి తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ సందర్శించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోశ్‌లను అడిగి సరిపడా సిబ్బంది ఉన్నారా అని తెలుసుకున్నారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. బీఎన్‌ఎస్ చట్టాలపై పోలీసులు పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. మౌలిక సదుపాయాలు లేనట్లు గుర్తించారు. అనంతరం పట్టణంలోని ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై చర్చించారు.

కొత్త చట్టాలపై శిక్షణ

కొత్తగా అమలవుతున్న ఎన్‌బీఎస్ చట్టాలపై జిల్లాలో ఇప్పటి వరకు 600 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఐపీసీ సెక్షన్లకు స్వస్తి పలికి ఇక నుంచి ఎన్‌బీఎస్ ద్వారా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామని వివరించారు. కొత్త చట్టాలతో ఫిర్యాదు విషయంలో 15 రోజుల్లోగా నిజనిర్ధారణ చేసుకుని కేసు నమోదు చేసే వెసులుబాటు లభించిందన్నారు. ఈనెల 10 వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. జిల్లాలోని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని, త్వరలో 45 మంది కానిస్టేబుళ్లు, 15 మంది ఎస్ఐలు వస్తారని స్పష్టం చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని కల్బుర్గి జిల్లా పోలీసుల సమన్వయంతో నేరాల అదుపునకు కృషిచేస్తామని వెల్లడించారు. ఇటీవల పరిగిలో జరిగిన చోరీని ఛేదించేందుకు ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోశ్, రూరల్ సీఐ అశోక్ తదితరులున్నారు.

సిద్ధాపూర్ భూములపై విచారణ జరిపించండి

మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే వీర్లపల్లి వినతి

కొత్తూరు: సిద్ధాపూర్ శివారులో టీజీఐఐసీకి కేటాయించిన భూముల పరిహారం విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. గత ప్రభుత్వ హయాంలో సిద్ధాపూర్ శివారులో ఉన్న సుమారు 330 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలను సేకరించి పరిశ్రమల ఏర్పాటుకు టీజీఐఐసీకి అప్పగించారు. అసైన్డ్ భూముల పరిహారం విషయంలో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. పేదల ఇళ్ల స్థలాలు, స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి కలెక్టర్ శశాంకతో ఫోన్లో మాట్లాడి సిద్ధాపూర్ భూముల వ్యవహారంలో విచారణ జరిపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

గెజిటెడ్ సంతకానికి పాట్లు

- అధికారుల చుట్టూ తిరిగి విసుగెత్తుతున్న జనం
- కొందరు అందుబాటులో లేక.. ఇంకొందరు సుముఖత చూపక
- పథకాలకు దూరమవుతున్న ప్రజలు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



దౌల్తాబాద్: ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు, ఉద్యోగ దరఖాస్తులపై గెజిటెడ్ అధికారి సంతకం పెట్టించుకునేందుకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దరఖాస్తు పూర్తి చేయడం, అవసరమైన సర్టిఫికెట్లు జత చేయడం ఒక ఎత్తయితే గెజిటెడ్ అధికారి సంతకం పెట్టించుకోవడం తలనొప్పిగా మారుతోంది. దీంతో పలువురు సంతకం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వీటికి తప్పనిసరి

వివిధ ప్రభుత్వ పథకాలతో పాటుగా ప్రభుత్వ ఉద్యోగాలకు, పోటీ పరీక్షలు, పైచదువుల దరఖాస్తులకు సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తుకు దంపతులది మొదటి వివాహమేనని ధ్రువీకరించడానికి ఈ సంతకం అవసరం. లీగల్ ఎయిడ్ సర్టిఫికెట్, పోటీ పరీక్షల దరఖాస్తులపై ఫొటో గుర్తింపు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌లో పేరు మార్పు, పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్, కోర్టుకు సమర్పించే జిరాక్స్ కాపీలపైనా గెజిటెడ్ అధికారి సంతకం ఉండాల్సిందే. అప్పుడే ఆ దరఖాస్తులోని సమాచారమంతా వాస్తవమని ధ్రువీకరించబడుతుంది.

పథకాలకు దూరం

దరఖాస్తులపై గెజిటెడ్ సంతకం చేయించడం దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారుతోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల వారికి ఈ ఇక్కట్లు ఎక్కువ ఎదురవుతున్నాయి. ఏ కార్యాలయానికి వెళ్లినా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. తహసీల్దారు కార్యాలయం, పాఠశాలలు, కళాశాలలు పీహెచ్‌సీలు ఇలా ఏ కార్యాలయానికి వెళ్లినా సంతకం చేయించుకోవడం పలుమార్లు ఇబ్బందిగా మారుతుండగా కొందరు విసిగిపోయి పథకాలకు దరఖాస్తు చేయకుండానే వదిలేస్తున్నారు. తప్పనిసరిగా అవసరమైన వారు మాత్రం అధికారుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

కొందరు అధికారుల విముఖత

దరఖాస్తులపై సంతకం చేసేందుకు కొందరు అధికారులు సంశయిస్తున్నట్లు తెలుస్తోంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర దరఖాస్తులపై సంతకాలు చేసిన పలువురు చిక్కులు ఎదుర్కొన్నట్లు సమాచారం. దీంతో తెలియని వారికి సంతకం చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నట్లు తెలిసింది. ఇక మరికొందరు అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తుండడంతో దరఖాస్తుదారులకు అందుబాటులో ఉండడంలేదు. ఆయా అంశాలను పరిగణలోకి తీసుకుని గెజిటెడ్ అధికారి సంతకం విషయంలో వెసులుబాటు కల్పించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

గెజిటెడ్ అధికారులు

- యూనివర్సిటీ వీసీలు
- రాష్ట్ర వర్సిటీ ఫ్యాకల్టీ మెంబర్లు
- వైద్యులు
- ఇంజనీర్లు
- ఎస్‌డీఓ(సబ్ డివిజినల్ ఆఫీసర్)
- సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు
- తహసీల్దార్లు
- ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు తదితరులు

బీఎన్‌ఎస్ కింద తాండూరులో తొలికేసు

ఏటీఎం చోరీకి విఫల యత్నం

- భారతీయ న్యాయ సంహిత 331(4), 305, 62 సెక్షన్‌ల ప్రకారం కేసు

తాండూరు: అర్ధరాత్రి ఏటీఎం చోరీకి యత్నించిన కేసులో భారతీయ న్యాయ సంహిత చట్టం(బీఎన్‌ఎస్) ప్రకారం తాండూరులో తొలికేసు నమోదు చేశామని టౌన్ సీఐ సంతోశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. పట్టణంలోని శాంత్‌మహల్ థియేటర్ పక్కన ఉన్న యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి ప్రవేశించి ఏటీఎం మిషిన్‌ను రాయితో పగులగొట్టాడు. ఆటోమెటిక్ అలారం సిస్టమ్ ఉండటంతో బ్యాంకు హెడ్ ఆఫీస్‌కు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన బ్యాంకు సిబ్బంది వెంటనే పీఎస్‌కు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఏటీఎం వద్దకు వెళ్లేసరికి దొంగ పరారయ్యాడు. ఈ విషయమై తాండూరు యాక్సెస్ బ్యాంకు మేనేజర్ మంజుల సోమవారం తెల్లవారు జామున పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత కొత్త చట్టం 331(4),305,62 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మెట్రోకు ‘గ్రేట్ ప్లేస్ టు వర్క్’ సర్టిఫికెట్



సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థకు మధ్య స్థాయి సంస్థల కేటగిరీలో ‘గ్రేట్ ప్లేస్ టు వర్క్’ సర్టిఫికెట్ లభించింది. అత్యుత్తమ పని సంస్కృతిని ప్రోత్సహించే సంస్థలకు గ్రేట్ ప్లేస్ టు ఇండియా సంస్థ ప్రతి సంవత్సరం ఈ ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ గుర్తింపును ప్రకటిస్తుంది. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోకు ఈ సర్టిఫికేషన్ లభించడం విశేషం. పని చేసే చోట ఉద్యోగులకు సానుకూలమైన, సాధికారికమైన పరిస్థితులను కల్పించడంలో ఎల్‌అండ్‌టీ మెట్రోకు గల నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తుంది. విశ్వసనీయత, గౌరవం, నూతన ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించే పరిస్థితులను కల్పించడంలో ఉద్యోగుల సంక్షేమం, వృద్ధి విషయంలో కంపెనీకి గల అంకిత భావానికి సముచితమైన గుర్తింపు లభించిందని అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తొలి ప్రయత్నంలోనే ట్రస్ట్ ఇండెక్స్‌కి సంబంధించి అత్యధికంగా 92 స్కోరు పొందిన అతి కొద్ది సంస్థల్లో ఒకటిగా ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో నిలిచింది. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ అండ్ సీఈవో కేవీబీరెడ్డి మాట్లాడుతూ, ఈ గుర్తింపు లభించడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఉద్యోగుల కఠోర పరిశ్రమ, అంకితభావానికి ఈ సర్టిఫికేషన్ నిదర్శనమని పేర్కొన్నారు. పని ప్రదేశంలో పరిస్థితులను నిరంతరం మెరుగుపర్చేందుకు, ఉద్యోగుల ఎదుగుదల కోసం అత్యుత్తమమైన అవకాశాలను కల్పించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉద్యోగులే అత్యంత విలువైన సంపద అని ఎల్‌అండ్‌టి విశ్వసిస్తుందన్నారు. పరస్పర సహకారం, గుర్తింపు, వృత్తిగత అభివృద్ధికి దోహదపడే సంస్కృతిని పెంపొందిస్తున్నందుకుగాను ఎల్‌అండ్‌టీ సీహెచ్‌ఆర్‌వో బినో జోస్ మాథ్యూను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మెగా డీఎస్సీ ప్రకటించండి



నిరసన వ్యక్తంచేస్తున్న నిరుద్యోగులు

అనంతగిరి: మెగా డీఎస్సీని ప్రకటించి, తమ జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతుందనుకుంటే అరకొర పోస్టులతో తమ బతుకులను చీకటిమయం చేసిందని నిరుద్యోగులు ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి, కేవలం 10వేల పోస్టులను ప్రకటించి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. డీఎస్సీని వెంటనే వాయిదా వేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ రవూఫ్

బొంరాస్‌పేట: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్‌ఐ రవూఫ్ తిరిగి వాటిని అప్పగించారు. డిసెంబరు 30న మండల పరిధి బోడబండతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ వీఓ వై22 ఫోన్ చోరీ కాగా.. మదన్‌పల్లికి చెందిన రాజు ఫోన్ పోగొట్టుకున్నాడు. వారి ఫిర్యాదు మేరకు.. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సెల్‌ఫోన్ల ఆచూకీ కనుగొన్న పోలీసులు.. సోమవారం బాధితులకు అందజేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కుల్కచర్ల: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాములమ్మ(31) గర్భ సంచికి సంబంధించిన వ్యాధితో కొంత కాలంగా బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి తీవ్ర భరించలేక జూన్ 26న ఇంటో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబీకులు ఆమెను మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా ఆమె చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇలాంటి కేసును గతంలో సీఆర్‌పీసీ 174కింద నమోదు చేసేవారు. కొత్త చట్టాల అమలు నేపథ్యంలో 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశారు.

సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

తాండూరు: సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకున్న ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడు తన ఖాతా నుంచి రూ.4,06,087 పోగొట్టుకున్నాడు. ఇదే విషయమై మార్చి 6న బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి కేసులో పురోగతి లేకపోవడంతో తిరిగి సోమవారం తాండూరు టౌన్ పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. గతంలో జరిగిన నేరం కావడంతో ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సంతోష్ తెలిపారు.

తొలి రోజు మొక్కుబడిగా..

తాండూరు: ప్రజావాణి తొలిరోజు అట్టర్‌ఫ్లాప్ అయింది. ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల దరఖాస్తులు స్వీకరించాలి. అయితే డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాషా మాత్రమే సమయానికి రాగా.. మిగతా ఉద్యోగులు 11 గంటల తర్వాత కార్యాలయానికి వచ్చారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 13 అర్జీలు అందాయి. అందులో రెవెన్యూ-11, నీటిపారుదల 1, మున్సిపల్ 1 దరఖాస్తులు అందాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు. అయితే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన ఆర్డీఓ శ్రీనివాసరావు కొడంగల్ నియోజకవర్గంలో అత్యవసర సమావేశం ఉన్నందున హాజరు కాలేదని కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

మంచి చేస్తే.. మళ్లీ గెలిపిస్తారు

పదవిపోయినా ప్రజలకు సేవ చేయండి

- ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- అక్రమ కట్టడాలను కూల్చేయండి
- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



తాండూరు రూరల్: ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ పట్నం, ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు రూరల్: ప్రజలకు మంచి చేస్తే ప్రజాప్రతినిధులుగా మళ్లీ వారు ఎన్నుకుంటారని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం ఎంపీపీ అనితాగౌడ్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ నెల 4వ తేదీతో ముగియనున్న ఎంపీటీసీల పదవీకాలం సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడారు. పదవులు పోయినా.. ప్రజల్లో ఉంటూ వారికి మంచి చేస్తే ప్రజలు మిమ్మల్ని ఆదరిస్తారని తెలిపారు.

మారనున్న రిజర్వేషన్లు

గత ప్రభుత్వం స్థానిక సంస్థలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలోపేతం చేస్తారని తెలిపారు. బీసీ కుల గణన వలన సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లు మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందులో డీసీసీబీ డైరెక్టర్ సంగెం రవిగౌడ్, ఎంపీపీ అనితగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, ఉమ్మడి జిల్లా ఎంపీటీల ఫోరం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు శంషొద్దీన్, ఎంపీటీసీలు రవిసింథే, వసంత్ కుమార్, రాజ్‌కుమార్, శివకుమార్, శాంతుకుమార్, బస్వరాజమ్మ, సుశీలమ్మ, శ్యామల, రత్నమాల, నర్సమ్మ, సీతాభాయ్, నాయకులు వడ్డె శ్రీనివాస్, ఎస్.పండరి, మేఘనాథ్‌గౌడ్, విజయలక్ష్మీ, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్ వినతి పత్రం

తాండూరు టౌన్: పట్టణంలోని 31వ వార్డులో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ పనులను పూర్తి చేయాలని బీజేపీ కౌన్సిలర్ లావణ్య కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. వార్డులో 20 శాతం మేర భగీరథ పైపులైను పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అది పూర్తి చేయించి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. అదే విధంగా సమద్ ఫంక్షన్ హాల్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ భవనం, దుకాణ సముదాయాలను నిర్మించాలని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని కౌన్సిలర్ వెల్లడించారు.

రూ.16 కోట్లతో చిలకవాగు అభివృద్ధి..

తాండూరు టౌన్: నాలాను కబ్జా చేసి, నిర్మించిన కట్టడాలను కూల్చి వేయాలని ఎమ్మెల్యే బీఎమ్మార్ ఆదేశించారు. వరద నీటి ప్రవాహంపై ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమ్ సింహరెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మోస్తరు వర్షానికే పట్టణంలోని పలు వార్డులు జలమయం అవుతున్నాయని విస్మయం వ్యక్తంచేశారు. వరదనీరు పారే నాలాను కబ్జా చేసి, పలువురు నిర్మాణాలు చేపట్టినట్లు తెలిసిందని, వెంటనే వాటిని కూల్చేయాలన్నారు. వరద ఇళ్ల మధ్య నిలవకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వరదనీరు సులభంగా వెళ్లేందుకు రూ.16 కోట్లతో చిలకవాగు అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం పూర్తి స్థాయి ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రధాన రహదారుల వెంట విద్యుద్దీపాలు వెలిగేలా చూడాలని విద్యుత్ అధికారులకు చెప్పారు.

ఆందోళన వద్దు..

- ప్రభుత్వం అండగా ఉంటుంది
- భూములు ఇస్తున్న రైతులకు నగదు, ఉద్యోగం, ఇంటి స్థలం
- ఆర్డీఓ శ్రీనివాస్‌రావ్, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, కడ అధికారి

కొడంగల్: భూములు ఇస్తున్న రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా వారికి అండగా ఉంటుందని భూ సేకరణ అధికారి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావ్, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఇరువురు మాట్లాడారు. ప్రభుత్వ అవసరాల కోసం అప్పాయిపల్లి గ్రామం సర్వే నంబర్ 19లోని అసైన్డ్ భూమి ఇస్తున్న రైతులకు నగదు, ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. మెడికల్ కళాశాలతో పాటు ఇతర అవసరాలకు భవనాల నిర్మాణం కోసం ఆ భూమిని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వానికి చెందిన భూమికి ధర చెల్లిస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎకరాకు రూ.10లక్షలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. రైతులు అంగీకార పత్రాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాలకు ‘భరోసా’ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ గోపాల్

- బీడు భూములకు సాయం చేయొద్దు: రైతులు
- ప్రభుత్వానికి నివేదిస్తాం: డీఏఓ గోపాల్

ధారూరు: ‘రైతు భరోసాకు 10 ఎకరాలనే ప్రామాణికంగా తీసుకోవాలి. వెంచర్లు, సాగుచేయని రియల్, బీడు భూములకు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారికి రైతుభరోసా ఇవ్వకూడదు’ అని రైతులు స్పష్టం చేశారు. నిజమైన అర్హులకే పెట్టుబడి సాయం అందజేయాలని కోరారు. సోమవారం ధారూరు, హరిదాస్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్లు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిరణ్ సమక్షంలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. రైతు భరోసాపై అవగాహన కల్పించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. పీఏసీఎస్‌ల చైర్మన్లు మాట్లాడుతూ పెట్టుబడి సాయం ఆలస్యమైనా.. నిజమైన అర్హులకు సాయం అందేలా చూడాలని కోరారు. సాయం పెంచాలని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నట్లుగా కత్తెర సీజన్‌ను పరిగణనలోకి తీసుకుని మూడు సార్లు భరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఈఓలు నర్సింలు, రవి, రైతులు పాల్గొన్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

పోలీసుల అదుపులో నిందితులు



మృతుడు సయ్యద్ హిదాయత్ ఆలీ(ఫైల్)

మణికొండ: గతంలో ఉన్న వివాహేతర సంబంధాన్ని తిరిగి కొనసాగించాలని కోరిన వ్యక్తిని ఓ మహిళ తన ప్రియుడితో కలిసి హత్యచేసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సోమవారం తెలిపిన మేరకు.. గోల్కొండ చోటా బజార్‌లో ఉంటున్న సయ్యద్ హిదాయత్ ఆలీ(31) సివిల్ ఇంజనీర్‌గా పనిచేసేందుకు రెండు సంవత్సరాల క్రితం దుబయ్‌కు వెళ్లాడు. అంతకు ముందు అతనికి అదే ప్రాంతంలో ఉంటున్న సీమా బేగం(24)తో వివాహేతర సంబంధం ఉంది. సయ్యద్ హిదాయత్ ఆలీ దుబయ్‌కు వెళ్లిన తరువాత సీమా బేగం ఫలక్‌నామాలోని తీగలకుంటకు చెందిన సయ్యద్ అమీర్ (29)తో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. అయితే దుబాయ్‌నుంచి ఇటీవల తిరిగి వచ్చిన హిదాయత్ ఆలీ తిరిగి వచ్చాడు. ఆమెను కలిసి తిరిగి తనతో వివాహేతర సంబంధం కొనసాగించాలని ఒత్తిడి చేశాడు. ఈ విషయం సీమబేగం అమీర్‌కు తెలిపింది.

చంపాలనే పథకం వేసి...

దీంతో ఇద్దరూ కలిసి హిదాయత్ ఆలీని చంపాలని నిర్ణయించుకున్నారు. అతనితో మంచిగా మాట్లాడి బయటకు తీసుకుని రావాలని సీమబేగంకు తెలిపాడు. దీంతో సీమా బేగం జూన్ 29వ తేదీన హిదాయత్ ఆలీతో కలిసి అతని క్వాలీస్ వాహనంలోనే ముందుగా వేసుకున్న పథకం ప్రకారాం నిర్మానుష్యంగా ఉండే మంచిరేవుల గ్రీన్ ల్యాండ్ కాలనీ వైపు తీసుకుని వచ్చింది. వారిని అనుసరిస్తూ బైక్‌పై వచ్చిన సయ్యద్ అమీర్ అక్కడకు వచ్చి హిదాయత్ ఆలీతో గొడవకు దిగాడు. ఓ ప్రహరీ పక్కకు తీసుకుని వెళ్లి కత్తితో పలుమార్లు విచక్షణారహితంగా పొడవటంతో తీవ్ర రక్తస్రావం జరిగి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు నిందితులు బైక్‌పై అక్కడినుంచి పరారయ్యారు.

ఐడీ ప్రూఫ్ ఆధారంగా విచారణ...

మృతుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా అతని ఇంటికి వెళ్లి విచారణ చేయటం, స్థానికంగా ఇద్దరు వ్యక్తులు, ఓ బురఖా వేసుకున్న మహిళ మధ్య అక్కడ గొడవ జరిగిందనే విషయం తెలుసుకున్న పోలీసులు ఆ దిశగా విచారణ మొదలు పెట్టారు. మృతుని చిరునామాకు వెళ్లి విచారణ చేయగా గతంలో సీమాబేగంతో ఉన్న వివాహేతర సంబంధం తెలిసింది. ఆకోణంలో విచారణ చేయగా ఆమెతో పాటు సయ్యద్ అమీర్‌ను ఆదివారం రాత్రి షాహీన్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరం అంగకరించారు. దాంతో నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆరోగ్య సమస్యలతో బాలుడు ఆత్మహత్య



వెంకటేశ్ మృతదేహం

కొడంగల్: ఆరోగ్య సమస్యతో బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మున్సిపల్ పరిధి గుండ్లకుంటలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శివరాములు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ద భీములు కుమారుడు వెంకటేశ్(16) ఆరు నెలలుగా సుద్దకట్టు వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో చికిత్స చేయించారు. అయినా మూత్ర విసర్జనకు ఇబ్బంది పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు సోమవారం ఉదయం పొలానికి వెళ్లి క్రిమి సంహారక మందు తాగాడు. ఇంటికి వచ్చి విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. వెంటనే కుటుంబీకులు కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి భీములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు. అయితే కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి గతంలో సీఆర్‌పీసీ 174 కింద కేసు నమోదు చేసేవారని, కొత్త చట్టం ప్రకారం బీఎన్ఎస్ఎస్ 194 కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నూతన కమిటీ నియామకం



రమేష్ దంపతులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: శ్రీవాణి సాంస్కృతిక సంస్థ రాష్ట్ర నూతన కమిటీని సోమవారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా వీహెచ్‌పీ తెలుగు రాష్ట్రాల క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్, ప్రధాన కార్యదర్శిగా కేఎల్ఎన్.కన్నా, కోశాధికారిగా గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా యాదగిరిచారిని నియమించారు. అదే విధంగా సంస్థ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా వెంకటేశ్, మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా ఆంజనేయులు, కో కన్వీనర్లుగా డాక్టర్ రాములు, కృష్ణారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్‌గా మనోహర్‌రావు, కో కన్వీనర్‌గా సతీష్, వికారాబాద్ జిల్లా కన్వీనర్‌గా వెంకటేశంను నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుమార్, పరంధాములుగౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, గౌరీశంకర్, సురేందర్, బాలకృష్ణ, రఘురాంచారి, పవన్‌కుమార్, విద్యాసాగర్‌రెడ్డి, ఇస్తారయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

పరిగి: బైక్ లారీ ఢీ కొన్న ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు మండలం ఉమెంత్యాల గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి పరిగిలో ముత్తూట్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా సెలవులో ఉండగా పని నిమిత్తం సోమవారం పరిగి పట్టణానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రాఘవపూర్ గ్రామం దాటగానే షాద్‌నగర్ నుంచి వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న గోపాల్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కి సమాచారం ఇచ్చి, పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నగరానికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నలుగురు వ్యక్తుల బైండోవర్



వెంచర్‌లో వంట సామగ్రి

శంకర్‌పల్లి: ఓ వెంచర్‌లో పూజలు చేసి, వండుకోవడానికి వెళ్లిన వ్యక్తులను పోలీసులు బైండోవర్ చేశారు. ఈ సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధి కొండకల్‌లోని అపర్ణ వెంచర్‌లో దర్గా ఉందని మోకిల తండా వ్యక్తులు కొందరు సోమవారం పూజలు చేశారు. అనంతరం దావత్ చేసుకోవడానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వెంచర్ యాజమానులు వారిని అడ్డుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదుల సంఖ్యలో జనాలు ఉండటంతో మోకిల, బీడీయల్ ఠాణాల నుంచి వచ్చిన పోలీసులు.. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శంకర్‌పల్లి ఠాణాకు తరలించి, తహసీల్దార్ సురేందర్ ఎదుట బైండోవర్ చేశారు.

తహసీల్ కార్యాలయంలో చోరీకి యత్నం

తాండూరు: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు నమోదు అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మున్సిపల్ పరిధి మాణిక్‌నగర్‌కు చెందిన రవి(32) సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తహసీల్ కార్యాలయంలోకి ప్రవేశించాడు. భవనంలోని మొదటి అంతస్తులోని సర్వేయర్ గదిలోకి వెళ్లి, బీరువా, కుర్చీలను అపహరిస్తుండగా.. స్థానికులు గమనించారు. సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు రవిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ తారాసింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత 305, 62 చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

వంటింటి నుంచి.. బడిబాట



పాఠశాలలో బాలున్ని చేర్పిస్తున్న సీఆర్‌పీ సోమ్లా

బొంరాస్‌పేట: చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో ఆ బాలుడు వంటింటికి పరిమితమయ్యాడు. కూలిపని చేసే తండ్రి, అన్నకు నిత్యం వంటచేసి పెడుతున్న ఆ పసివాడిని సీఆర్‌పీ సోమ్లా చొరవతో బడిలో చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మదన్‌పల్లితండాకు చెందిన శాంతిబాయి, లాల్యానాయక్‌కు నలుగురు సంతానం. ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులున్నారు. కాగా తల్లి చనిపోవడంతో చిన్నకొడుకు ఎ.ఆకాశ్ ఇంట్లోనే ఉంటూ.. పెద్దలకు సహాయంగా ఉన్నాడు. విషయం తెలుసుకున్న సీఆర్‌పీ సోమ్లా.. బాలుడికి చదువు గురించి చెప్పి.. బడిబాట పట్టించాడు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆరవ తరగతిలో చేర్పించాడు. ఈ సందర్భంగా హెచ్ఎం హరిలాల్ సోమ్లాను అభినందించారు.

నేలకూలిన చెట్టు.. ద్విచక్ర వాహనాలు ధ్వంసం

నాంపల్లి: గగన్ విహార్ భవన సముదాయంలో ఓ చెట్టు నేలకూలింది. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. చెట్టు కూలిన సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నాంపల్లి గాంధీభవన్ ఎదుట ఉన్న గగన్ విహార్ భవనం కింది భాగంలో గృహకల్ప భవన సముదాయానికి ఆనుకుని పార్కింగ్ స్థలం ఉంది. ఇక్కడ ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తారు. ఈ స్థలంలోనే చెట్టు కూలిపోయి ద్విచక్రవాహనాల మీద పడింది. ఈ ఘటనలో ఏడు వాహనాలు ధ్వంసమయ్యాయి. గగన్ విహార్ భవనాన్ని హౌసింగ్ బోర్డు అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. చెట్టు కూలిన విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులకు తెలియజేయడంతో.. సిబ్బంది వెంటనే తొలగించారు.

అయినా వారే ‘కీ’లకం

- మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
- ఆరోపణలున్నా ప్రధాన బాధ్యతలు, ఉన్నతాధికారుల వత్తాసు
- బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో ఉద్యోగి చేతికే ‘కీ’
- గతంలో కమిషనర్ డిజిటల్ కీ తో అనుమతులు జారీ చేసిన ఎంప్లాయి
- సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం



శంషాబాద్: ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారి చేతికే ‘కీ’లక బాధ్యతలు. తప్పు మీద తప్పులు చేస్తున్నా వారినే వెనకేసుకొస్తూ ‘కీ’ ఇస్తున్న ఉన్నతోద్యోగులు. మున్సిపాలిటీలో గత ఐదేళ్లలో కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అవినీతిపై ఫిర్యాదులు వెల్లువెత్తినా పట్టించుకోకపోవడంలో మతలబు. మర్మమేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు..

ఆటో రిక్షాతో వచ్చి..

ఐదేళ్ల క్రితం చెత్త ఆటో రిక్షాతో కాంట్రాక్టుతో మున్సిపాలిటీలో ఎంట్రీ ఇచ్చిన ఓ వ్యక్తి ఆ తర్వాత ఉన్నతోద్యోగి పరిచయంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా మారాడు. కొంత కాలంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో మున్సిపల్ కమిషనర్ డిజిటల్ ‘కీ’ సైతం తన దగ్గర పెట్టుకుని పత్రాలు జారీలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా జారీ చేసినట్లు ఇటీవల పై అధికారులు సైతం గుర్తించారు. అంతే కాకుండా ఒక్కో పత్రానికి రూ. 5 వేల నుంచి రూ.6 వేలకు పైగా వసూలు చేస్తున్నట్లు స్వయంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. అతడిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారుల పరిశీలనలో ఆరోపణలు నిజమని నిగ్గుతేలినా చర్యలు తీసుకుంటే బయటికి బద్నాం అయితామన్న ఉద్దేశంతో చర్యలకు మిన్నకుండిపోయారు. అవినీతి ఆరోపణలున్నా అతడిపై కొందరు ఉన్నతాధికారులు ఎందుకంత ప్రేమ చూపుతున్నారని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పారిశుద్ధ్య విభాగంలో..

పారిశుద్ధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక బాధ్యతలు కట్టబెట్టారు. ఉద్యోగ కోడ్ రీత్యా ఖాకీ ప్యాంటు, తెల్ల చొక్కాతో ఉండాల్సిన సదరు ఉద్యోగి యునిఫాం కూడా వేసుకోకుండా సివిల్ దుస్తులు, ఖద్దరు చొక్కాలు వేసుకుని ప్రభుత్వ ఉద్యోగులపై సైతం అజమాయిషీ చెలాయిస్తున్నాడు. ఇతడి వైఖరి భరించలేని సామాజిక కార్యకర్తలు, సమాచార హక్కు కార్యకర్తలు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పాటు సంబంధిత ఉద్యోగి వివరాలు కోరినా అధికారులు మాత్రం వెల్లడించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులపైనే పెత్తనం చెలాస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక మతలబేమిటో అర్థం కావడం లేదు..టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్‌తో పాటు పలు విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తీరుపై అనేక ఆరోపణలున్నా అధికారులు వారిని వెనకేసుకోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలోనూ అనేకం..

గతంలో మున్సిపాలిటీలో పనిచేసిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మున్సిపల్ కమిషనర్ డిజిటల్ కీతో జీవో 111లో సైతం దాదాపు ముప్పైకి పైగా అనుమతులు జారీ చేశాడు. ఆ తర్వాత తెరుకున్న సదరు ఉన్నతాధికారి అతపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి అనమతులు రద్దు చేశాడు. అదే విధంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు ఓ ప్రభుత్వాధికారి, తపాలా కార్యాలయం అధికారి కలిసి చనిపోయిన వారి పేరును కొనసాగిస్తూ భారీ మొత్తంలో పింఛన్లు నొక్కేశారు. దీనిపై నామ మాత్రం విచారణ చేపట్టి పక్కన పడేశారు.

సరిపడా ఉద్యోగులున్నా..

రెవెన్యూ తదితర విభాగాల నుంచి వచ్చిన ఉద్యోగులున్నా నేటికి కీలక బాధ్యతలు తమకు అనుకూలమైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కట్టబెట్టడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని ప్రజాప్రతినిధులు, పట్టణ పౌరులు చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగాలు పూర్తి అవినీతి మయంగా మారాయని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉద్యోగులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోరు. శంషాబాద్ మున్సిపాలిటీలో పౌరసేవలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. కొన్ని విభాగాలు అవినీతిమయంగా మారాయి.

– అక్రమ్‌ఖాన్- శంషాబాద్

విచారణ చేపడుతున్నాం..

ఆరోపణలు వచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. వారిని కీలక బాధ్యతల నుంచి తొలగించి ప్రభుత్వ ఉద్యోగుల చేతికే ఇస్తున్నాం. ఆరోపణలపై విచారణ చేపడుతున్నాం. డిజిటల్ కీ నా వద్దనే ఉంది. అన్ని రకాలుగా పరిశీలించిన తర్వాతే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశాం. అవినీతికి అవకాశం లేకుండా పౌరసేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బి. సుమన్‌రావు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్